# విశ్వాస న్యాయము

## The Law of Faith

**పాఠ్యోద్దేశము:** క్రియా న్యాయమును బట్టి పొందుకోలేని లక్ష్యములను విశ్వాస న్యాయము సంపూర్తి చేస్తుందని చూపించుట.

**లేఖనములు :** రోమా 3:27-4:25

## ఉపోద్ఘాతము

**పునర్విమర్శనము** : మొదటిగా, దేవుని నీతిని గ్రహించకుండా మరియు మానవుని జీవితముతో దేవునినీతికున్న సంబంధమును గ్రహించకుండా విశ్వాస న్యాయమును మనము సరిగా అభినందించలేము. ఇప్పుడు "క్రీస్తునందు" ఆయన నీతి బయలు పరచబడెను అను వాస్తవమును గత మూడు పాఠములు స్పష్టము చేసాయి. తీర్పు కొరకు దేవుని నీతిని ప్రమాణముగా మానవుడు కలిగియుండకపోతే తన గమనము కొరకు సరియైన బహుమానమును పొందలేడని మనము నేర్చుకున్నాము. ఈ విషయమును పౌలు పద్ధతిలో చెప్పవలెనంటే ఇలా చెప్పవచ్చు - "ప్రతి మనుష్యుడును అబద్ధికుడగును గాని దేవుడు సత్యవంతుడు కాక తీరడు" (రోమా 3:4).

మోషేకు దేవుడిచ్చిన ధర్మశాస్త్రము దేవుని నీతిని బయలుపరచెను. కాని అది మానవుణ్ణి శిక్షించడం కూడా జరిగింది. చివరిగా ఆదాము వంటి శరీరము కలిగిన మన శరీర రూపములో యేసుక్రీస్తు ఈ లోకములోనికి వచ్చుట మనము చూచితిమి. ఆయన "ఆదామునందు" అను శరీరము నందు దేవుని నీతితో పరిపూర్ణమైన సమన్వయముతో జీవించెను. ఇది ఆయనకు సిలువపైన దేవుని నీతిని ప్రదర్శించుటకు మంచి అవకాశమును ఇచ్చెను. పాపమునకు దేవుని వైఖరియే సిలువయైయున్నది. గత కాలములో ఆయన క్షమించిన పాపములకు కూడా సిలువయే ఆయన వైఖరి.

"పాపము చేయువాడు తప్పక మరణించవలెను" రోమా 1:32 అనుదానికి కూడా ఆయన వైఖరి సిలువయే. ఎందుకంటే యేసు పశ్చాత్తాప్తులైన పాపుల కొరకు చనిపోవుటకు ఇష్టపడి యుండెను, ఆయనను మృతులలో నుండి లేపి క్రొత్తయుగానికి శిరస్సుగా ఆయనను హెచ్చించుటలో దేవుడు నీతిమంతునిగా తీర్చబడెను. ఎఫెసీ పత్రిక మొదటి అధ్యాయములో పౌలు దానిని గూర్చి "క్రీస్తు నందు" అని పలుమార్లు చెప్పియుండెను. క్రీస్తును మన ప్రభువుగా అంగీకరించి మారు మనస్సును పొందిన మనకు దేవుడు ఆయన నీతిని ఇప్పుడు బయలుపరచెను. మనము నీతిమంతులము కాదు అయిననూ, ఆయన రక్తములో మన విశ్వాసమును బట్టి "క్రీస్తునందు" పాలి భాగస్థులమై మరియు దేవుని నీతిని ఒక ఉచిత బహుమానము వలె ఆనందించగలము. ఇదే విశ్వాస న్యాయము (law of faith).

మనము విశ్వాస న్యాయమును బట్టి ఏమి పొందియున్నాము? మన జీవితాలను సరిగా నడిపించుకొనగలుగుటకై మనము దేవుని నీతిని చూచుటకు అనుమతించ బడితిమి. మన స్వంత బలహీనతలను మనము పరిశీలించవచ్చు కాని మనము అవమానముగా భావించకన్కరలేదు. ఎందుకంటే మనము ఆత్మీయముగా ఎదుగుతున్న కొలది దేవుడు మనలను నీతిమంతులుగా ఎంచుతున్నాడు. దేవునితో సమన్వయతను కలిగి జీవించుటకు మనము నీతిమంతులుగా తీర్చబడియున్నాము.

క్రియా న్యాయమునకు వ్యత్యాసముగా రోమా పత్రిక రచయిత ఇలా అంటున్నాడు."ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు; ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది." (రోమా 3:20). ఈ పాఠములో క్రియా న్యాయమును బట్టి పొందుకొనలేనివి విశ్వాస న్యాయము ద్వారా మనము పొందు కొనగల అనేక ఇతర లక్ష్యములను మనము చూచెదము.

## పాఠము

పాఠ్యోద్దేశములో చెప్పబడిన రెండు న్యాయములను గూర్చి స్పష్టత కలిగినవారమై ఈ పాఠమును ప్రారంభించెదము. ఈ రెండు న్యాయములను గూర్చి క్రింది లేఖనములో తేటగా చెప్పబడినది:

*ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు. ఎందుకనగా - ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది. ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడను సంగతి స్పష్టమే. ఏలయనగా - నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును.*

*గలతీ. 3:10,11*

ఏ రకమైన క్రియా న్యాయమైననూ సరే, ఒక వ్యక్తి దేవుని యెదుట యదార్థముగా నిలబడవలెనంటే అతడు సమస్తమును యదార్థముగా చేయవలెనని కోరుతుంది. యేసు తప్ప దీనిని చేయుట ఎవరి వలన సాధ్యము కాదు; అందుచేత ఈ రకమైన న్యాయమును బట్టి మానవుని కొరకు కొన్ని లక్ష్యములు ఆశీర్వాదములు అందుకొన లేనివిగా ఉన్నవి. దేవుడు మనస్సులో కలిగిన లక్ష్యములు మరియు ఆశీర్వాదములు కేవలము నీతిమంతుడైన మానవుని కొరకు మాత్రమే ఉన్నాయి. నేరారోపణ ఆయన ప్రణాళికలో లేదు.

అందరును దేవుడనుగ్రహించు మహిమను పొందలేనందున, నీతిని సంపాదించుటకు విశ్వాస న్యాయము అను పద్ధతిని ఆయన కృపా సహితముగా మనకిచ్చెను. "నీతిమంతుడు విశ్వాస

మూలముగా జీవించును" (రోమా 1:17). "అందరి యెడల కరుణ చూపవలెనని, దేవుడు అందరిని అవిధేయతాస్థితిలో మూసివేసి బంధించియున్నాడు" (రోమా 11:32). పౌలు తన పత్రికలో చెప్పుచున్న ఈ గొప్ప సిద్ధాంతములన్నియు రోములో ఉన్న క్రీస్తు సంఘ సభ్యులందరికి బోధింపబడి యుండెను (రోమా 15:14; 16:16). వారు మరలా తిరిగి బలము పొందుట అవసరం లేదని చెప్పుట కాదు, అయిననూ, ఈ సిద్ధాంతముల అన్వయింపు అవసరమని పౌలు వీటిని వ్రాయుటలో ఉద్దేశించాడు. జాతుల సమ్మేళనము, యూదులు మరియు అన్యులు ఇరువురూ, పౌలు చెప్పిన ఈ సత్యముల సందర్భము కొరకు సంఘములో గొప్ప తలంపుగా కనిపిస్తున్నారు. రోమా పత్రికలో యూదులు మరియు అన్యులు అను పదములను పలుమార్లు వాడినట్లు చూడగలము: రోమా 1:1,14,16; 2:9,10, 24,28; 3:1,9, 29; 9:24,30; 10:12; 11:11-13,25; 15: 9-12,16,18,27; 16:4.

కొన్ని సంగతులు మరి ఏ ఇతర మార్గమును బట్టి కాక కేవలం విశ్వాస న్యాయమును బట్టి మాత్రమే పొందుకొనగలిగినవి ఉన్నాయి. క్రైస్తవులు అతిశయమును జయించునట్లు విశ్వాసన్యాయము శక్తినిస్తుంది. ఏమైననూ భూమి మీద యేసు జీవించుచున్న కాలములో యూదా ప్రజలు అతిశయపడుచూ దేవుని పట్ల తిరస్కారమును కలిగిన వారుగా ఉండిరి. వారు మెస్సీయా కొరకు ఎదురు చూచు చున్నామని చెప్పిరి, కాని చాలామంది యేసు యొక్క దేవుని రాజ్య ప్రభోదమును అంగీకరించలేదు. వారి సంప్రదాయము నందు వారు బహుగా అతిశయించిరి. వారు "మెడ వంచని ప్రజలుగా ఉండినందున చాలా మంది వారు సంప్రదాయము కొరకు చనిపోయారు" (అపొ. కార్య. 7:51). యేసు క్రీస్తులో విశ్వాసము ద్వారా దేవుని నీతి వెల్లడియగునని పౌలు వివరణ యిచ్చిన తరువాత, అతడు ప్రశ్నవేసెను "కాబట్టి అతిశయకారణమెక్కడ? అది కొట్టివేయబడెను. ఎట్టి న్యాయమును బట్టి అది కొట్టి వేయబడెను? క్రియాన్యాయమును బట్టియా? కాదు, విశ్వాసన్యాయమును బట్టియే." (రోమా 3:27).

విశ్వాసన్యాయమమును బట్టి నమ్మకస్తులైన క్రైస్తవులందరూ నీతిమంతులుగా లెక్కించబడిరి. మనమతిశయించుటకు ఏమిలేదు, ఎందుకంటే మన నీతి దేవుని యొద్ద నుండి బహుమానముగా వచ్చెను. మన తోటి మనుష్యులతో మనము పోటీ పడనవసరము లేదు. క్రైస్తవులు దేవునితో సరిగానేయున్నారు; అందుచేత, ఆయనతో సరిగా నుండుటకు మనము ఇతరులకు సహాయపడతాము. ఈ పద్ధతి ప్రకారము ఏ ఒక్కరూ వేరే వ్యక్తి కంటే ఎక్కువ నీతిమంతుడు లేదా తక్కువ నీతిమంతుడుకాదు, ఎందుకంటే ప్రతి ఒక్కరూ 100% లేదా ఏమి కాదు (1 యోహాను 3:7-10). మనము తీర్పు తీర్చు పనిలో లేము (యాకోబు 4:11,12). మనము పగ తీర్చుకొనుట అవసరము లేదు. మనకు జరిగిన దుర్నీతినంతటిని దేవుడే చూచుకొనును (రోమా 12:14-21).

మోషే ద్వారా దేవుడు శాసించిన ధర్మశాస్త్రమునకు విశ్వాసన్యాయము వ్యతిరేకముకాదు. "క్రీస్తునందు" మనము ధర్మశాస్త్రము నుండి విడుదల పొంది యున్నప్పటికిని, విశ్వాసన్యాయము ధర్మశాస్త్రమును నిరర్థకము చేయుటలేదు (రోమా 3:31). ప్రతికూలముగా, మనము ధర్మశాస్త్రమును స్థాపించుచున్నాము. అతిశయించు విషయములో ఇది ఎలా జరిగినదో మనము చూడగలము. అతిశయపడుటకు మానవుడ్ని ఆపివేయుట ధర్మశాస్త్రము యొక్క లక్ష్యమైయుండెను. కాని మనుష్యుల స్వనీతిని గూర్చిన అతిశయము నిమిత్తము వారి నోళ్ళను మూసివేయుటకు అది విశ్వాసన్యాయమును తీసుకొనెను. తన మంచి పనులను గూర్చి మనుష్యుల యెదుట అతిశయపడిన వ్యక్తియైన అబ్రాహాము ఒక ఉదాహరణ. కాని అతడు దేవుని యెదుట అతిశయపడలేకపోయెను. అతడు ఎన్నో మంచిపనులను చేసియున్నప్పటికిని, దేవునితో యదార్థముగా ఉండుటకై అతడు విశ్వాసన్యాయమును ఆధారము చేసుకోవలసి వచ్చెను (రోమా 4:1-5).

విశ్వాస న్యాయము మానవునికి సంతోషములను తెచ్చిందని రాజైన దావీదు సాక్ష్యమిచ్చుచున్నాడు (రోమా 4:6-8). మన సంతోషము అనునది మన వ్యక్తిత్వము మరియు మన గుణముపై ఆధారపడియుంటుంది. దేవునితోగల మన సహవాసముపై ఆరోగ్య లక్షణముల యొక్క అభివృద్ధి ఆధారపడియుండును. క్రియా న్యాయము అను పద్ధతి క్రింద, మన బుద్దిహీన ప్రవర్తనను గూర్చి అవమానముగా మాత్రమే మనము భావించగలము. అందుచేత, మన బలహీనతలను గూర్చి అవమానముగా ఉండుటకు దూరముగా ఉంచగల విశ్వాసన్యాయము అను దాని మీద మన సంతోషము ఆధారపడియుండునని దావీదునకు తెలుసు. మనస్సాక్షిపై యున్న అవమానముతో ఆరోగ్య లక్షణములను మరియు మంచి ప్రవర్తనను మనము వృద్ధి చేసుకొనలేము.

"క్రీస్తునందు" అను నూతన యుగముతో విశ్వాస న్యాయము ప్రారంభము కాలేదు. అతని విశ్వాసమును బట్టి అతడు నీతిమంతుడైయుండెనను సాక్ష్యము హేబెలు ఎలా పొందెనో మనము చూచుచున్నాము (హెబ్రీ. 11:4). మన కొరకు దేవుడు చేసిన వాగ్దానములను బట్టి అబ్రాహాము విషయములో మనకు విశ్వాస న్యాయము అనునది మరింత అర్థవంతముగా మారెను. అబ్రాహాము కాలములో, ఉన్న ప్రపంచము నోవహు దినములలో ఉన్న పరిస్థితిలోనే ఉన్నది. అయిననూ, జల ప్రళయముతో భక్తిహీన ప్రజలను ఆయన తుడిచివేయుటకు బదులుగా, దేవుడు నమ్మకత్వము కలిగిన వారిని హెచ్చించెను.

అబ్రాహాము, దేవునిలోను మరియు ఆయన వాగ్దానములయందు చాలా బలమైన విశ్వాసమును కలిగియుండెను. అతని విశ్వాసము చేత అతని నీతికి ముద్రగా సున్నతి ఇవ్వబడెను. దేవుడు అబ్రాహామును విశ్వాసులందరికీ తండ్రిగా చేసెను. దీనిలో అన్యులు కూడా ఉన్నారు (రోమా 9:23-26). ఈ రోజుకి కూడా, దేవుడు అబ్రాహాము సంతానము ద్వారా మనకు చేసిన వాగ్దానములను మనం పొందుకోడానికి అబ్రాహామునకు తప్పక కుమారునిగా నుండవలెను.

విశ్వాస న్యాయము ద్వారా అబ్రాహామునకు వచ్చిన వాగ్దాన ఫలితమే మన జీవితాలలో పరిశుద్ధాత్ముని సన్నిధియైయున్నది (గలతీ. 3:14).

అబ్రాహాము మరణము తరువాత అనేక వందల సంవత్సరములు గడిచి యుండగా, జీవమునిచ్చు నియమమునకు అతిక్రమము వలన "క్రియా న్యాయము" చేర్చబడెను (ఆది. 26:5; గలతీ. 3:19). ఈ న్యాయము వాగ్దానములను పొందలేక పోయెను. "ఏలయనగా ధర్మశాస్త్రము ఉగ్రతను పుట్టించును; ధర్మశాస్త్రము లేని యెడల అతిక్రమమును లేకపోవును" (రోమా 4:15). ఒకే సమయములో దేవుడు మనలను ఆశీర్వదించి శిక్షించలేడు గనుక ఆయన ఆశీర్వాదములన్నియు నీతి యొక్క విశ్వాసన్యాయము అను పద్ధతి ద్వారా మనకు తప్పక రావలెను. జ్ఞాపకముంచుకొనుము, దేవుడు పాపులందరి యెడల ఉగ్రుడైయున్నాడు. స్వాభావికముగా మనము ఇంకనూ పాపులమైయున్నాము.

మోషే ధర్మశాస్త్రము అబ్రాహాము పిల్లలను ఇశ్రాయేలు జనాంగమునకు పరిమితి చేసి సున్నతి అను పద్ధతిని ప్రవేశపెట్టెను. అనేక జనములకు తండ్రియగుననే దేవుని వాగ్ధానమును ఆనందించుటకు అబ్రాహామును విశ్వాసన్యాయము అనుమతించెను. సున్నతికి పూర్వమే ఈ విశ్వాస న్యాయము పనిచేయుచున్నది, క్రైస్తవులు అబ్రాహాము కుమారునిగా నుండుటకు సున్నతి పొందనక్కరలేదు.

అబ్రాహాము యొక్క విశ్వాసమును బట్టి అతని ద్వారా దేవుడు తన శక్తిని చూపించగలిగెను (రోమా 4:17-21). ఇది కేవలం అబ్రహాము కొరకే వ్రాయబడలేదు, కాని క్రైస్తవుల అందరి కొరకు కూడా వ్రాయబడెనని పౌలు చెప్పుచున్నాడు (రోమా 4:23-24). విశ్వాస న్యాయమును బట్టి, దేవుడు నీతిమంతులతో వ్యవహరించినట్లు మనతో వ్యవహరించగలడు. ఇప్పుడు మన ద్వారా దేవుడు తన చిత్తమును జరిగించ గలడు ఎందుకంటే దేవుడు నీతి గల ప్రజలతో పని చేయగలడు. ఒకవేళ నీతిగా ఉండుటమనేది మన క్రియల మీద ఆధారపడినట్లయితే, ఆయన ఏ మాత్రమును మనతో పనిచేయడు.

దేవుడ్ని మహిమపరచుటకు మనల్ని అనుమతించునునది విశ్వాసన్యాయము చేత పొందుకొను మరొక లక్ష్యమైయున్నది. మన క్రియలుకేవలం ఇతరులకు సహాయం చేస్తాయి. లేదా మనల్ని మహిమపరుస్తాయి. దేవునికి మహిమను చెల్లించుటకు మన క్రియలు మన విశ్వాసమును కోరతాయి (రోమా4:20). రోమా పత్రికలోనున్న విశ్వాసము యొక్క గొప్పవాక్యము బహుశః ఇదే కావచ్చు, "దేవుని మహిమపరచి, **ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు** సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసము వలన బలమునొందెను." (రోమా 4:21). దేవుని వాగ్దానముల యందు మనము విశ్వాసము కలిగియుండుట గొప్ప విషయమే, కాని దేవుని శక్తిలో మనము విశ్వాసము కలిగియుండుట అనేది నాకు, దేవునికి మరింత దగ్గరగా రావడమే! దేవుడు శక్తిమంతుడు. ఈ విశ్వాస న్యాయము అను కృపావరమును బట్టి దేవునికి మహిమ కలుగును గాక.

## చర్చ కోసం ప్రశ్నలు

1 క్రియా న్యాయమును బట్టి ఒక వ్యక్తి యదార్థవంతుడుగానుండుటకు ఏమి చేయాలి?

2 విశ్వాస న్యాయమును బట్టి ఒక వ్యక్తి ఎలా యదార్థవంతుడగును?

3 విశ్వాస న్యాయమును బట్టి నీతిమంతునిగా లెక్కించబడి బైబిలులో పేర్కొనబడిన మొదటి వ్యక్తి ఎవరు?

4 విశ్వాస న్యాయమును స్థాపించుట దేవునికి ఎందుకు అవసరమైనది?

5 క్రియా న్యాయమునకు విశ్వాస న్యాయము వ్యతిరేకమా? ఎందుకు లేదా ఎందుకు కాదు?

6 విశ్వాస న్యాయము అతిశయించుటను ఎలా ఆపుతుంది?

7 సంతోషాన్ని క్రియా న్యాయమును బట్టి కాక విశ్వాసన్యాయమును బట్టి పొంద వచ్చు ఎందుకని?

8 అబ్రాహాము ద్వారా మనకు వాగ్దానము చేయబడిన ఆశీర్వాదమును మోషే ధర్మశాస్త్రమును బట్టి పొందుట అసాధ్యమైనది ఎందుకు?

9 విశ్వాస న్యాయమును బట్టి జీవించు వారి ద్వారా దేవుని శక్తి ఎలా బయలుపర్చ బడుతుందో వివరించుము?

10 శ్రేష్ఠమైన మహిమను మనము దేవునికి ఎలా ఇవ్వగలము?